

శ్రీసీతారాముల కల్యాణం చూద్దాం రారండి

శ్రీరామ నవమి పర్వదినాన్ని పురస్కరించుకొని ఎల్బీనగర్/మలక్‌పేట జోన్ పరిధిలోని దేవాలయాలు, కాలనీలు ముస్తాబయ్యాయి. హిందువుల ఆరాధ్య దైవమైన శ్రీరాముడి కల్యాణ మహోత్సవం, పట్టాభిషేకం ఘనంగా నిర్వహించేందుకు ఆలయ కమిటీలు ఏర్పాట్లు చేశాయి. కాలనీలు, బస్తీలను శ్రీరాముడి బ్యానర్లు, కాషాయ తోరణాలతో భక్తులు అలంకరించుకుంటున్నారు. సీతారాముల ఉత్సవ మూర్తులతో తీసే భారీ ఊరేగింపు ఏర్పాట్లలో రామ భక్తులు నిమగ్నమయ్యారు. సీతారాముల కల్యాణోత్సవం అనంతరం ఆలయాలు, కాలనీలు, బస్తీల్లో భక్తులకు అన్నదాన కార్యక్రమాలు ఉంటాయని నిర్వాహకులు పేర్కొంటున్నారు. – దిల్‌సుఖ్‌నగర్



శ్రీఅష్టలక్ష్మి ఆలయంలో శ్రీసీతారాముల ఉత్సవమూర్తులు

- శ్రీరామనవమి ఉత్సవాలకు సర్వం సిద్ధం
- చలువ పందిళ్ల ఏర్పాటు, విద్యుద్దీపాల వెలుగులో దేవాలయాలు
- వాడవాడలా సీతారాముల కల్యాణానికి ఏర్పాట్లు పూర్తి
- శ్రీరాముడి పట్టాభిషేకాలతో పరవశించనున్న భక్తులు
- నేడు కర్మన్‌ఘాట్ దేవాలయంలో సీతారాముల కల్యాణోత్సవం



ఎల్బీనగర్/చంపాపేట: శ్రీరామ నవమి పర్వదినాన్ని పురస్కరించుకొని సీతారాముల కల్యాణోత్సవానికి భక్తులు పెద్దఎత్తున హాజరుకానున్న నేపథ్యంలో ఆలయాల ప్రాంగణంలో చలువ పందిళ్లను ఏర్పాటు చేశారు. కర్మన్‌ఘాట్ హనుమాన్ దేవాలయంలో బుధవారం ఉదయం 5గంటల నుంచే ప్రత్యేక పూజలు ప్రారంభమవుతాయని ఆలయ కమిటీ పేర్కొంది. ఉదయం 8గంటలకు విష్ణు సహస్ర పారాయణం, 9గంటలకు ఉత్సవమూర్తుల ఎదుర్కోళ్ల కార్యక్రమం ఉంటుందని తెలిపింది. ఉదయం 10గంటలకు శ్రీసీతారామచంద్రస్వామి కల్యాణం మహోత్సవం ప్రారంభమవుతుందని పేర్కొంది. సీతారాముల కల్యాణ మహోత్సవానికి వచ్చే వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా భారీ ఏర్పాట్లు చేశామని ఆలయ పాలక మండలి చైర్మన్ నల్లా రఘుమారెడ్డి మంగళవారం విలేకరుల సమావేశంలో తెలిపారు. వేసవి దృష్ట్యా మంచినీటి సౌకర్యం ఏర్పాటు చేశామని, కల్యాణోత్సవం అనంతరం భక్తులకు అన్నదానం కార్యక్రమం ఉంటుందని పేర్కొన్నారు.

కల్యాణోత్సవానికి ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, మాజీ మంత్రి ఈటల

◆ మన్సురాబాద్‌లో జరిగే సీతారాముల కల్యాణ మహోత్సవానికి ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డితో పాటు మాజీ మంత్రి ఈటల రాజేందర్ హాజరవుతున్నారని శ్రీషిర్డిసాయి సంస్థాన్ చైర్మన్, కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి తెలిపారు. కల్యాణోత్సవం అనంతరం భారీ ఊరేగింపు ఉంటుందన్నారు. రామ భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని నిర్వాహకులు విజ్ఞప్తి చేశారు. ముందస్తు జాగ్రత్తగా ఆలయాల వద్ద పోలీసులతో భద్రత ఏర్పాట్లు చేశారు.

రౌడీషీటర్ల కదలికలపై నిఘా



చాదర్‌ఘాట్ సీఐ సైదులు

చాదర్‌ఘాట్: వచ్చే నెల 13న జరిగే పార్లమెంట్ ఎన్నికలు ప్రశాంతంగా ముగిసేందుకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నామని చాదర్‌ఘాట్ సీఐ సైదులు తెలిపారు. మంగళవారం ఆయన పోలీసు స్టేషన్‌లో మాట్లాడుతూ, గత నాలుగు వారాల నుంచి రౌడీషీటర్లపై నిఘా పెట్టామని తెలిపారు. స్టేషన్ పరిధిలోని రౌడీషీటర్లు ఏమి చేస్తున్నారు, ఎటు వెళ్తున్నారు, అసాంఘీక కార్యకలాపాల్లో ఏమైనా పాల్గొంటున్నారా అనే కోణంలో ప్రత్యేక నిఘా పెట్టామని తెలిపారు. ప్రతిరోజూ సదరు రౌడీషీటర్ల ఇళ్లకు వెళ్లి సక్రమంగా ఉండాలని, వివాదాల్లో తలదూర్చ వద్దని కౌన్సిలింగ్ ఇస్తున్నామని తెలిపారు. స్టేషన్ పరిధిలో 20 మంది రౌడీషీటర్లను బైండోవర్ చేశామని సీఐ సైదులు తెలిపారు. బైండోవర్ నియమ నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పోలింగ్ బూత్‌ల పరిధిలో ఉన్న రౌడీషీటర్లపై నిఘా ఉంచడమే కాకుండా సత్ప్రవర్తన కలిగి ఉండాలని హెచ్చరించామని చెప్పారు.

కాలనీలో డ్రైనేజీ పైప్‌లైన్ వేయాలి

ఎమ్మెల్యేకు అయ్యప్ప కాలనీవాసుల వినతి



నాగోలు: డివిజన్ పరిధిలోని అయ్యప్పకాలనీలో బాక్స్ డ్రెయిన్ నిర్మాణం కారణంగా కాలనీలో ఉన్న పైప్‌లైన్లు పూర్తిగా దెబ్బతిన్నాయని కాలనీవాసులు పేర్కొంటున్నారు. తమ ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని నూతన పైప్‌లైన్ వేయాలని కాలనీ సంక్షేమ సంఘం నాయకులు మంగళవారం ఎల్బీనగర్ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే మాట్లాడుతూ... ఇప్పటికే చాలాసార్లు అధికారులతో ఈ విషయంపై మాట్లాడానని వారికి తెలిపారు. ప్రస్తుతం ఎన్నికల హడావుడిలో అధికారులు ఉన్నారని, ఎన్నికల పూర్తయిన వెంటనే కాలనీ సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కాలనీవాసులు నర్సింహచారి, రవికాంత్ శర్మ, సుదర్శన్, గోపాల్ పలువురు సభ్యులు పాల్గొన్నారు.

కర్మన్‌ఘాట్‌లో రాగిడి లక్ష్మారెడ్డి పూజలు



రాగిడి లక్ష్మారెడ్డితో డివిజన్ బీఆర్ఎస్ నాయకులు

చంపాపేట: చంపాపేట డివిజన్ కర్మన్‌ఘాట్ శ్రీధ్యానాంజనేయ స్వామివారిని మంగళవారం మల్కాజిగిరి బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి దర్శించుకుని స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ పూజల్లో బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు ముదుపు రాజిరెడ్డి, నాయకులు కొండ యాదగిరి, మల్లేష్‌గౌడ్, జగదీష్, అంజిరెడ్డి, ఉమామహేశ్వర్, ప్రభాకర్, రవిముదిరాజ్, సదానందరెడ్డి, చందు, శివ, సురేందర్‌రెడ్డి, వసంతకుమార్ తదితరులు పాల్గొన్నారు.

మైనార్టీల సానుభూతి పొందాలని కొత్త డ్రామా

ఎమ్మెల్యే అక్బరుద్దీన్‌పై హైదరాబాద్ బీజేపీ అభ్యర్థి మాధవీలత ఫైర్



సైదాబాద్‌లో గృహిణికి ప్రచార కరపత్రం అందజేస్తున్న బీజేపీ అభ్యర్థి మాధవీలత

సైదాబాద్: మైనార్టీల సానుభూతి పొంది ఎన్నికల్లో లబ్ధి పొందాలన్న దురుద్దేశంతో తమకు ప్రాణహాని ఉందంటూ మజ్లిస్ ఎమ్మెల్యే అక్బరుద్దీన్ భయం నటిస్తూ మాట్లాడుతున్నారని హైదరాబాద్ ఎంపీ బీజేపీ అభ్యర్థి మాధవీలత ఆగ్రహం వ్యక్తం చేశారు. పాతబస్తీ అభివృద్ధి పట్టకుండా ఎప్పుడూ రెచ్చగొట్టేలా ప్రసంగాలు చేసే మజ్లిస్ నేతలు ఓటమి భయంతోనే సానుభూతి పొందేందుకు కొత్త డ్రామాలు ఆడుతున్నారని ఆమె విమర్శించారు. మంగళవారం సైదాబాద్ డివిజన్ కార్పొరేటర్ కొత్తకాపు అరుణ రవీందర్‌రెడ్డి ఆధ్వర్యంలో డివిజన్ పరిధిలోని పలు కాలనీలు, బస్తీల్లో ఆమె పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి పాద యాత్ర ద్వారా ఇంటింటికీ వెళ్లి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాధవీలత మాట్లాడుతూ, పాతబస్తీలో ప్రచారం నిర్వహిస్తున్న సమయాల్లో పలువురు మైనార్టీ మహిళలు పాతబస్తీలో సౌకర్యాలు లేక ఇబ్బందులు పడుతున్నామని తెలిపారన్నారు. రాష్ట్రంలో ఎవరి ప్రభుత్వం వచ్చినా వారితో మజ్లిస్ నేతలు లాలూచీ పడుతూ పాతబస్తీ అభివృద్ధిని విస్మరిస్తున్నారని విమర్శించారు. పాతబస్తీలో మజ్లిస్ ఆగడాలు అడ్డుకోవటం కోసం హైదరాబాద్ ప్రజలు తనను గెలిపిస్తారని ధీమా వ్యక్తం చేశారు. తన సేవా కార్యక్రమాల గురించి ప్రధాని నరేంద్ర మోదీ అభినందించడాన్ని తనకు లభించిన ఆశీర్వాదంగా భావిస్తానని ఆమె అన్నారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కొత్తకాపు రవీందర్‌రెడ్డి, జీహెచ్ఎంసీ మాజీ డిప్యూటీ మేయర్ సుభాష్‌చందర్జీ, శ్రీకాంత్‌రెడ్డి, డివిజన్ అధ్యక్షుడు వినోద్ పాల్గొన్నారు.

మహిళల రక్షణే షీ టీమ్స్ లక్ష్యం

- మహిళలు ధైర్యంగా ఫిర్యాదు చేయాలి
- రాచకొండ సీపీ తరుణ్ జోషి

నాగోలు: బాలికలను, మహిళలను వేధించే పోకిరీలను రాచకొండ షీ టీమ్స్ పోలీసులు వదిలిపెట్టే ప్రసక్తి లేదని, మహిళలు నిర్భయంగా ఫిర్యాదు చేయాలని మహిళలకు రాచకొండ సీపీ తరుణ్ జోషి సూచించారు. మంగళవారం ఎల్బీనగర్‌లోని సీపీ క్యాంపు కార్యాలయం వద్ద షీ టీమ్స్ పట్టుబడిన 122 మంది ఆకతాయిలకు వారి కుటుంబ సభ్యుల సమక్షంలో కౌన్సెలింగ్ నిర్వహించారు. రాచకొండ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని పలు ప్రాంతాల్లో గత 15 రోజుల్లో షీ టీమ్స్‌కు 122 మంది ఈవ్ టీజర్లు పట్టుబడ్డారు. ఇందులో మేజర్లు79 మంది, మైనర్లు 43 మంది ఉన్నారు. పట్టుబడిన వారికి రాచకొండ ఉమెన్ సేఫ్టీ వింగ్, షీ టీమ్స్ ఆధ్వర్యంలో కౌన్సెలింగ్ ఇచ్చారు.. గత నెల 16 నుంచి 31 వరకు 148 ఫిర్యాదులందాయని తెలిపారు. వీటిలో ఫోన్ ద్వారా వేధించినవి 14, సోషల్ మీడియా ద్వారా వేధించినవి 36, నేరుగా వేధించినవి 98 ఉన్నాయన్నారు. ఇందులో క్రిమినల్ కేసులు 14, పెట్టీ కేసులు 70 నమోదు చేయగా, 43 మందికి కౌన్సిలింగ్ నిర్వహించారు. రాచకొండ పరిధిలో ఎక్కడ మహిళలు వేధింపులకు గురైతే ఫోన్ నం. 8712662111 కు ఫిర్యాదు చేయవచ్చని సీపీ తరుణ్ జోషి తెలిపారు. సమావేశంలో విమెన్ సేఫ్టీ వింగ్ డీసీపీ ఉషావిశ్వనాథ్, ఏసీపీ వెంకటేశం, అడ్మిన్ ఎస్ఐ రాజు తదితరులు పాల్గొన్నారు.

సమాజ సేవకుడు వైష్ణవీ ప్రసాద్‌ను ఆదరించాలి



వైష్ణవీ ప్రసాద్ ఎన్నికల మేనిఫెస్టోను విడుదల చేస్తున్న స్వరూపానందేంద్ర, స్వాత్మానందేంద్ర

నాగోలు: సమాజంలోని అన్ని వర్గాల ప్రజలకు సహాయ సహకారాలు అందించేది బ్రాహ్మణ జాతేనని విశాఖ శ్రీశారదా పీఠాధిపతులు శ్రీ స్వరూపానందేంద్ర సరస్వతి మహాస్వామి అన్నారు. విశాఖ శారద పీఠం ఉత్తరాధికారి స్వాత్మానందేంద్ర సరస్వతి స్వామితో కలిసి కొత్తపేట మోహన్‌నగర్‌లోని మల్కాజిగిరి ఎంపీ స్వతంత్ర అభ్యర్థి శ్రీ వైష్ణవీ ప్రసాద్ (పెండ్యాల శేషసాయి వరప్రసాద్) నివాసానికి విచ్చేశారు. ఈ సందర్భంగా వైష్ణవీ ప్రసాద్ ఎన్నికల మేనిఫెస్టోను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా స్వరూపానందేంద్ర సరస్వతి మాట్లాడుతూ, దేశానికి స్వాతంత్ర్యం రాకపూర్వం బ్రిటీష్ పాలనా కాలం నుంచీ ఆలయాలను రక్షించింది బ్రాహ్మణ జాతి మాత్రమేనని అన్నారు. భారతీయ సంస్కృతీ సంప్రదాయాల పరిరక్షణ బ్రాహ్మణ జాతితోనే సాధ్యమైందని అన్నారు. ఈ బ్రాహ్మణ సమాజానికి అండగా తాను ఉన్నానని, కేవలం బ్రాహ్మణ జాతికే కాకుండా ఇతరులకూ అండగా ఉంటానని ముందుకు వచ్చిన వైష్ణవీ ప్రసాద్‌ను అందరూ బలపర్చి పార్లమెంట్ ఎన్నికల్లో మల్కాజిగిరి ఎంపీగా గెలిపించాలని కోరారు. ఆంధ్రప్రదేశ్ దేవాదాయ శాఖ సలహాదారు జ్వాలాపురం శ్రీకాంత్, జంటనగరాల బ్రాహ్మణ సంఘాల సమాఖ్య పూర్వ అధ్యక్షుడు తులసి శ్రీనివాస్, వారణాసి వంశీ, ద్రోణంరాజు రవికుమార్, వక్కలంక శ్రీనివాస్‌రావు, మునిపల్లె శ్రీనివాస్, అరుణ, రాజేశ్వరి, రత్న, వనస్థలిపురం, దిల్‌సుఖ్‌నగర్, మీర్‌పేట తదితర ప్రాంతాల బ్రాహ్మణ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

బీజేపీ, బీఆర్ఎస్‌ల మధ్య లోపాయికారీ ఒప్పందం: దర్పల్లి



విలేకరులతో మాట్లాడుతున్న దర్పల్లి రాజశేఖర్‌రెడ్డి

లింగోజిగూడ: బీఆర్ఎస్, బీజేపీలు లోపాయికారీ ఒప్పందంతో పని చేస్తున్నాయని కాంగ్రెస్ పార్టీ జీహెచ్ఎంసీ ఫ్లోర్ లీడర్ దర్పల్లి రాజశేఖర్‌రెడ్డి ఆరోపించారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ, ఒప్పందం మేరకే ఎమ్మెల్యే బీఆర్ఎస్ నాయకులకు బీజేపీకి ఓటు వేయాలని ప్రచారం చేస్తున్నారని తెలిపారు. ఎవ్వరు ఎన్ని కుట్రలు పన్నినా పార్లమెంట్ ఎన్నికల్లో మల్కాజిగిరి నుంచి కాంగ్రెస్ విజయం సాధిస్తుందన్నారు. గతంలో కంటే ఎల్బీనగర్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ పటిష్టంగా ఉందని, మరికొందరికి కాంగ్రెస్ పథకాలు నచ్చడంతో పార్టీలో చేరుతున్నారన్నారు. కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చిన ప్రతి పథకాన్ని అమలు చేస్తుందని తెలిపారు. ఇతర పార్టీల నాయకులు కొందరు కాంగ్రెస్ పార్టీలో నాయకులు పని చేయడం లేదని అసత్య ప్రచారాలు చేస్తున్నార, అలాంటి వాటిని ప్రతి ఒక్కరూ తిప్పి కొట్టాలని సూచించారు. కేంద్రంలో గత పదేళ్లుగా అధికారంలో ఉన్న బీజేపీ హామీలను నెరవేర్చడంలో విఫలమైందని ఆరోపించారు. రాబోయే ఎన్నిక ల్లో కాంగ్రెస్ పార్టీకి ఓటు వేసి గెలిపించాలని కోరా రు. శ్రీకాంత్‌రెడ్డి, రాచకొండ శ్రీనాథ్‌రావు, ప్రవీణ్‌రెడ్డి పాల్గొన్నారు.

30 క్వింటాళ్ల బియ్యం పట్టివేత: కేసు నమోదు

చంచల్‌గూడ: నగర వ్యాప్తంగా సివిల్ సప్లై శాఖ అధికారులు విస్తృతంగా దాడులు చేస్తూ బ్లాక్ మార్కెట్‌కు తరలిస్తున్న రేషన్ బియ్యం, గోధుములను స్వాధీనం చేసుకుంటున్నారు. ఇదే క్రమంలో సోమవారం చావణీలో పీడీఎస్ బియ్యం అక్రమ నిల్వ చేసినట్లు సమాచారం అందుకున్న మలక్‌పేట సివిల్ సప్లై శాఖ డిప్యూటీ తహసీల్దారు ఎన్. కవిత దాడి చేసి 30 క్వింటాళ్ల బియ్యం స్వాధీనం చేసుకున్నారు. ఈ బియ్యాన్ని బ్లాక్ మార్కెట్‌కు తరలిస్తున్న ఉప్పుగూడకు చెందిన సయ్యద్ ఫారూక్ బాషా (35)ను అదుపులోకి తీసుకుని మాదన్నపేట పోలీసులకు అప్పజెప్పారు. అధికారులు ఇచ్చిన ఫిర్యాదుతో నిందితుడిపై కేసు నమోదు చేశారు.

సింగరేణి కాలనీలో బాలిక అదృశ్యం

సైదాబాద్: బ్యూటీషియన్ కోర్సు నేర్చుకుంటున్న బాలిక ఇంటి నుంచి వెళ్లి కనిపించకుండా పోయింది. సైదాబాద్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. .సింగరేణి కాలనీలో నివసించే ఆటోడ్రైవర్ శ్రీశైలం కుమార్తె అంబి శ్వేత (17) బ్యూటీషియన్ కోర్సు నేర్చుకుంటోంది. ఈనెల 12న ఆమె తమ ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. తండ్రి శ్వేత కోసం బంధువులు, స్నేహితుల ఇళ్ల వద్ద విచారించినా ఆచూకీ లభించలేదు. ఇటీవల శరత్ అనే యువకుడితో ఫోన్‌లో తరచూ మాట్లాడుతుందని, అతనిపై తమకు అనుమానంగా ఉందని బాలిక తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు సైదాబాద్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తు తెలియని మహిళ మృతి

చాదర్‌ఘాట్: గుర్తు తెలియని మహిళ మెట్రో పిల్లర్ల మధ్యలోని డివైడర్ వద్ద మృతి చెందింది. చాదర్‌ఘాట్ పోలీసు స్టేషన్ పరిధిలో ఈ ఘటన జరిగింది. పోలీసుల కథనం ప్రకారం ...సోమవారం రాత్రి మలక్‌పేటలోని మెట్రో పిల్లర్ల మధ్య ఉన్న డివైడర్‌పై మహిళ అపస్మారక స్థితిలో పడి ఉండటాన్ని గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఘటనాస్థలికి చేరుకున్న పోలీసులు 108 అంబులెన్స్‌కు సమాచారం ఇచ్చారు. 108 సిబ్బంది వచ్చి పరిశీలించి అప్పటికే ఆమె మృతి చెందినట్లు వెల్లడించారు. ఆమె వివరాల కోసం పోలీసులు చుట్టుపక్కల విచారించినా ఎలాంటి సమాచారం తెలియరాలేదు. మృతురాలు యాచకురాలై ఉండవచ్చని చాదర్‌ఘాట్ పోలీసులు భావిస్తున్నారు. మృతదేహాన్ని ఉస్మానియా ఆసుపత్రి మార్చురీకి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆర్థిక సమస్యలతో వ్యక్తి ఆత్మహత్య

నాగోలు: ఆర్థిక సమస్యలతో వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన ఎల్బీనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో మంగళవారం జరిగింది. ఎల్బీనగర్ పోలీసుల కథనం ప్రకారం... ఎల్బీనగర్ ఎస్‌బీహెచ్ కాలనీ నివాసి హరి రవికుమార్(48) కొంత కాలంగా క్రిప్టో కరెన్సీలో పెట్టుబడి పెట్టడంతో భారీగా నష్టాలు వచ్చాయి. ఈ నేపథ్యంలో ఆర్థిక సమస్యలు ఎదుర్కొంటున్నాడు. మంగళవారం భార్య మాధవీలత పని నిమిత్తం బయటకు వెళ్లగా రవికుమార్ ఒక్కడే ఇంట్లో ఉన్నాడు. ఆమె మధ్యాహ్నం ఇంటికి తిరిగి వచ్చేసరికి రవికుమార్ హాల్‌లోని సీలింగ్ ఫ్యాన్‌కు తాడులో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఆమె స్థానికుల సహాయంతో తాడును కత్తిరించి భర్తను కిందకు దింపింది. అప్పటికే రవికుమార్ చనిపోయాడు. తన భర్త క్రిప్టో కరెన్సీలో పెట్టుబడి పెట్టడం వల్ల భారీగా నష్టాలు వచ్చి ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్నాడని, దీంతో మనస్తాపానికి గురై ఆత్మహత్య చేసుకున్నాడని భార్య మాధవీలత ఎల్బీనగర్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం ఉస్మానియా హాస్పిటల్‌కు తరలించారు.

ఖాతాదారులకు సులభతరంగా సర్వీసులు అందించాలి

రిజర్వ్ బ్యాంక్ మాజీ అధికారి వైద్యనాథన్



సమావేశంలో పాల్గొన్న మాజీ రిజర్వ్ బ్యాంక్ అధికారి వైద్యనాథన్

నాగోలు: విశాఖపట్నం కో–ఆపరేటివ్ బ్యాంకు నాగోల్ బ్రాంచ్ సంప్రదింపుల కమిటీ సమావేశం మంగళవారం నిర్వహించారు. ఈ సమావేశానికి బ్రాంచ్ మేనేజర్ సంజయ్‌కుమార్ పాండే అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథులుగా రిజర్వ్ బ్యాంక్ మాజీ అధికారి వైద్యనాథన్, జోనల్ మేనేజర్ ప్రసాద్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... బ్యాంకు అభివృద్ధి, ఖాతాదారుల శ్రేయస్సు, అట్టడుగు, మధ్య తరగతి వర్గాలకు రుణాలు, మంజూరు చేసే విషయంలో ముందుండాలన్నారు. ఖాతాదారులకు సులభతరంగా సర్వీసులు అందించాలని తీర్మానం చేశారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు గోవిందరావు, సుధాకర్‌రెడ్డి, మూర్తి, బి.కృష్ణ, నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

మోదీ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి



సమావేశంలో మాట్లాడుతున్న మంజులారెడ్డి

సైదాబాద్: దేశంలో అన్నివర్గాల ప్రజల అభ్యున్నతి కోసం ప్రధాని నరేంద్ర మోదీ ప్రవేశ పెట్టిన పథకాలపై బీజేపీ మహిళా మోర్చా నాయకులు, కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి వివరించాలని బీజేపీ భాగ్యనగర్ జిల్లా మహిళామోర్చా అధ్యక్షురాలు మంజులారెడ్డి కోరారు. మంగళవారం సైదాబాద్‌లో ఆమె విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ, బీజేపీ అధిష్టానం ఈసారి హైదరాబాద్ ఎంపీ స్థానాన్ని మహిళకు కేటాయించినందువల్ల మహిళా నాయకులు సమష్టిగా కృషి చేసి అభ్యర్థి మాధవీలతను గెలిపించి నారీశక్తిని చూపించాలని అన్నారు. దశాబ్దాలుగా హైదరాబాద్ స్థానంలో తిష్ట వేసుకొని అరాచకాలకు పాల్పడుతున్న మజ్లిస్‌కు ఈ ఎన్నికల్లో తగిన గుణపాఠం చూపించాలని అన్నారు. సమావేశంలో బీజేపీ మహిళా మోర్చా నాయకులు పాల్గొన్నారు.

దివ్యాంగుల హక్కుల ఉల్లంఘనలపై ఫిర్యాదు చేయాలి



సెమినార్‌లో మాట్లాడుతున్న మనోహర్ ములే

నాగోలు: స్వేచ్ఛ, సమానత్వం, న్యాయం భారత రాజ్యాంగం ప్రసాదించిన హక్కులు, వాగ్దానాలని దివ్యాంగులతో సహా అందరికీ అన్ని వేళలా అవి అందుబాటులో ఉండాలని జాతీయ మానవ హక్కుల కమిషన్ సభ్యుడు డాక్టర్ డి. మనోహర్ ములే అన్నారు. కొత్తపేట డివిజన్ మోహన్‌నగర్‌లోని మానస స్పెషల్ స్కూల్‌లో ' దివ్యాంగుల మానవ హక్కుల పరిరక్షణ' అనే అంశంపై మంగళవారం సెమినార్ నిర్వహించారు. సదస్సులో ముఖ్య అతిథి పాల్గొన్న మనోహర్ ములే మాట్లాడుతూ, దివ్యాంగుల హక్కుల ఉల్లంఘన, వారికి జరిగిన అన్యాయాల గురించి జాతీయ మానవ హక్కుల కమిషన్‌కు పెద్దగా ఫిర్యాదులు అందడం లేదన్నారు. పౌరులందరూ దివ్యాంగుల హక్కుల పరిరక్షణ పట్ల అప్రమత్తంగా ఉండాలని, ఏదైనా అన్యాయం లేదా చట్టపరమైన హక్కుల ఉల్లంఘన ఎవరి దృష్టికైనా వస్తే, మానవ హక్కుల కమిషన్ వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్ లో ఫిర్యాదు చేయాలన్నారు. సమావేశంలో ఉస్మానియా యూనివర్సిటీ న్యాయశాస్త్ర ప్రొ. జీబీ రెడ్డి, ఎర్రగడ్డలోని ప్రభుత్వ మానసిక వైద్యశాల డాక్టర్ ఆర్.అనిత మాట్లాడారు. జాతీయ మానవ హక్కుల కమిషన్ సభ్యురాలు ఎస్.విజయభారతి, మానస ఇనిస్టిట్యూట్ డైరెక్టర్ మెర్సీ మధురిమ. కోశాధికారి మదన్ మోహన్‌రెడ్డి, వనజ, గీత, వెంకమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఈటలను భారీ మెజార్టీతో గెలిపించాలి



కొత్తపేటలో ఈటలకు మద్దతుగా ప్రచారం చేస్తున్న కార్పొరేటర్ పవన్‌కుమార్

నాగోలు: మల్కాగిరి బీజేపీ పార్లమెంట్ అభ్యర్థి ఈటల రాజేందర్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని కొత్తపేట డివిజన్ కార్పొరేటర్ నాయికోటి పవన్‌కుమార్ పిలుపు నిచ్చారు. మంగళవారం ఆయన ఆధ్వర్యంలో డివిజన్‌లోని కమర్షియల్ ట్యాక్స్ కాలనీలో బీజేపీ మల్కాజిరిగి పార్లమెంట్ అభ్యర్థి ఈటల రాజేందర్‌కు మద్దతుగా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ, ప్రధాన మంత్రి నరేంద్ర మోదీని మూడోసారి ప్రధానిగా చేయాలని, కమలం పువ్వు గుర్తుకు ఓటు వేసి ఈటల రాజేందర్‌ను గెలిపించాలని ఇంటింటికీ తిరిగి ప్రచారం నిర్వహించారు. బూత్ కమిటీల అధ్యక్షులు స్వర్ణ, ప్రవీణ్, బూత్ ఇన్‌చార్జి యు. రామకృష్ణ, సురేందర్, అనిల్ కుమార్, తోట మహేందర్ యాదవ్, కొత్త తిరుమల, లక్ష్మణ్ యాదవ్, మౌనిక, శివ, భూపేందర్ పాల్గొన్నారు.

రవీంద్రభారతి పాఠశాలలో శ్రీరామ నవమి వేడుకలు



చంపాపేట: చంపాపేటలోని రవీంద్ర భారతి పాఠశాలలో మంగళవారం శ్రీరామ నవమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులు శ్రీరామ, సీతమ్మ, లక్ష్మణ, వాలి, సుగ్రీవుడి వంటి వేషధారణలో ఆకట్టుకున్నారు. అంతేకాకుండా విద్యార్థులు ప్రదర్శించిన 'శ్రీరాముడి జననం, సీతా స్వయంవరం, శ్రీరామ పట్టాభాషేకం, సీతారామ కల్యాణం, శ్రీరామ వనవాసం'వంటి నాటకాలు అందరినీ ఆకట్టుకున్నాయి. విద్యార్థులు రామభజనలతో పాటు హనుమాన్ చాలీసా పఠింపజేశారు. దీంతో పాఠశాల ప్రాంగణంలో ఆధ్యాత్మిక శోభ వెల్లువిరిసింది. ఈ వేడుకలో రవీంద్రభారతి విద్యాసంస్థల డైరెక్టర్ రేవంత్, అకడమిక్ డైరెక్టర్ రాణి, జోనల్ ఇన్‌చార్జి బాబూరావు, ఏజీఎం చంద్రశుభర్, పాఠశాల ప్రిన్సిపాల్ ఆలేటి కవిత పాల్గొన్నారు.

మోదీ పాలనే కోరుకుంటున్నారు: సామ



సమావేశంలో మాట్లాడుతున్న సామ రంగారెడ్డి

ఎల్బీనగర్: దేశ ప్రజలు ముచ్చటగా మూడోసారీ మోదీ పాలననే కోరుకుంటున్నారని, అందుకే మల్కాజిగిరి పార్లమెంట్ స్థానంలో బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్ గెలుపునకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని రంగారెడ్డి జిల్లా అర్బన్ అధ్యక్షుడు సామ రంగారెడ్డి అన్నారు. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో మంగళవారం బీఎన్‌రెడ్డి నగర్ డివిజన్ కార్పొరేటర్ లచ్చిరెడ్డి కార్యాలయంలో ఏర్పాటు చేసిన బూత్‌స్థాయి అధ్యక్షుల సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. మోదీ పాలన దేశ ప్రజలు మెచ్చినందునే మరోసారి ఆయన అధికారంలోకి రావాలని ఓటర్లు కోరుకుంటున్నారని అన్నారు. పేదల సంక్షేమం కోసం మోదీ నాయకత్వంలో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలను ప్రజల ముందుకు తీసుకెళ్లి ఓట్లు అభ్యర్థించాలని కోరారు. కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి మాట్లాడుతూ, దేశం అభివృద్ధి చెందాలన్నా.. సుభిక్షంగా ఉండాలన్నా మోదీ సర్కారు రావాలని ప్రజలు కోరుకుంటున్నారని, బీజేపీ అభ్యర్థి ఈటలను గెలిపించుకొని పార్లమెంట్‌కు పంపాలని బూత్ స్థాయి కార్యకర్తలను ఆయన కోరారు. సమావేశంలో నాయకులు వనిపల్లి శ్రీనివాస్‌రెడ్డి, నవకిషోర్‌రెడ్డి, విష్ణువర్ధన్‌రావు విష్ణువర్ధన్‌రెడ్డి, పవన్‌రెడ్డి, సందీప్‌రెడ్డి, శ్రీరాముల గౌడ్ పాల్గొన్నారు.

రైతుబజార్లలో కూరగాయల ధరలు

వనస్థలిపురం: సరూర్‌నగర్/వనస్థలిపురం రైతుబజార్లలో కూరగాయల ధరలు (కిలో... రూపాయల్లో)... టమాటా 13, వంకాయ 35, బెండ 45, పచ్చిమిర్చి 55, కాకర 35, బీర 45, క్యాబేజీ 21, ఫ్రెంచి బీన్స్ 50, క్యారెట్ 21, దొండ 18–19, చిక్కుడు 40–50, గోకర 35, బీట్‌రూట్ 19. క్యాప్సికం 60, ఆలు 34, దోస 16, సొర 9, పొట్ల 18, ఉల్లిగడ్డ 20, చామగడ్డ 35.